# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **దేశవ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు రేపు జరగనుంది.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లో రేపు జరిగే ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద అవాంతరాలు కలిగించేందుకు యత్నించే వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఆదేశించారు.**

**3.** **ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు.**

**4.** **నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌హెచ్‌ఏఐ టోల్‌ప్లాజాల వద్ద పెరిగిన టోల్ రుసుములు ఈరోజు నుంచి అమల్లోకి వచ్చాయి.**

5. **ఈరోజు ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

========================

దేశవ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు రేపు జరగనుంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు, అసెంబ్లీ నియోజకవర్గాల ఉపఎన్నికలు కూడా అదే రోజున జరగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుంది. కౌంటింగ్ ట్రెండ్‌లు ఫలితాలు కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో results.eci.gov.inలో అలాగే ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో అందుబాటులో ఉంటాయని ఎన్నికల సంఘం తెలిపింది. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రేపు జరిగే ఓట్ల లెక్కింపులో భాగంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద అవాంతరాలు కలిగించేందుకు యత్నించే వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. లెక్కింపు సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా ఉండాలని చెప్పారు. పోస్టల్ బ్యాలట్‌ల లెక్కింపు విషయంలో ఈసీ మార్గదర్శకాలను పాటించాలని నిర్దేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి నిన్న ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్యమాధ్యమం ద్వారా సమీక్షించారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం ఈవీఎంలను సీల్ చేసే విధానంపై అవగాహన, స్టేట్యూటరీ నివేదిక, రౌండ్ వైజ్ నివేదికలు పంపించేందుకు

ప్రత్యేక బృందం ఏర్పాటు, ఈ నెల 8వ తేదీ లోపు నివేదించాల్సిన ఇండెక్స్ కార్డు రూపొందించే విధానంపై సూచనలు చేశారు. మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు, తదితర అంశాలపై జిల్లాల వారీగా ఎన్నికల అధికారులతో ముకేష్ కుమార్ మీనా సమీక్షించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ రోజు నుంచి ఎల్లుండి వరకు మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు మూసివేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మద్యం విక్రయాలపై ఎన్నికల సంఘం నిషేధం విధించింది.

---------------------------

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న ఉన్నతస్థాయి అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై విస్తృతంగా సమీక్షలు జరిపారు. దేశంలో పెరిగిన ఉష్ణోగ్రతలు, పెద్దసంఖ్యలో ప్రాణాలను బలిగొన్న అగ్నిప్రమాదాలపై వివరాలు తెలుసుకున్న ప్రధానమంత్రి.. ఆసుపత్రులు, బహిరంగ ప్రదేశాల్లో ఇటువంటి విపత్తుల నివారణకు క్రమం తప్పని తనిఖీలతో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెమాల్ తుపాను కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో తలెత్తిన వరదల పరిస్థితులను సమీక్షించారు. రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలు, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వేడిగాలులు కొనసాగే అవకాశముందని అధికారులు ప్రధాని దృష్టికి తెచ్చారు. రుతుపవనాలు ఈ ఏడాది దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం, సాధారణం కంటే అధికంగా ఉంటాయని.. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సాధారణ కంటే తక్కువగా ఉంటాయని వివరించారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత కొత్త ప్రభుత్వం అమలుచేయాల్సిన 'తొలి 100 రోజుల' ప్రణాళికపై ప్రధానంగా దృష్టి సారించాలని ప్రధాని మోదీ సూచించారు. జూన్ 5వ తేదీన 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా ఏర్పాటుచేయాల్సిన కార్యక్రమాలపైనా ఉన్నతాధికారులతో చర్చించారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిన్న రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. గవర్నర్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్రమంత్రులు, సీఎస్ శాంతి కుమారి తదితరులు ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన కళాకారులు.. తెలంగాణ చరిత్ర, సంస్కృతిని చాటిచెప్పేలా 17 కళలను ప్రదర్శించారు. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతానికి ఐదు వేల మంది శిక్షణ పోలీసులతో నిర్వహించిన ఫ్లాగ్ వాక్ ఆకట్టుకుంది. ప్రత్యేక కార్యక్రమాలను వీక్షించేందుకు నగరవాసులు తరలిరావడంతో ట్యాంక్‌బండ్ పరిసరాలు జనసంద్రంగా మారాయి.

---------------------------

ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రాన్ని మార్చి ప్రపంచంలోనే అగ్రగామిగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. నిన్న పరేడ్ మైదానంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. నాలుగు కోట్ల మంది ప్రజల హృదయాలు ఆనందంతో ఉప్పొంగే పర్వదినమని అభివర్ణించారు. తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరిగి దశాబ్దం పూర్తయిందంటూ.. రాష్ట్ర సాధనలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళి అర్పించారు. ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానావకాశాలు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ ప్రాధాన్యమని పేర్కొన్నారు.

---------------------------

గొప్ప వారసత్వం, భిన్న సంస్కృతులు తెలంగాణలో కనిపిస్తాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఆమె సామాజిక మాధ్యమం వేదికగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఐటీ సేవల్లో రాష్ట్రం గుర్తింపు పొందిందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు మరింత అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలకు భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశాభివృద్ధికి తెలంగాణ అందించిన సహకారం ప్రతి భారతీయుడికి గర్వకారణమని తెలిపారు. గొప్ప చరిత్ర, విశిష్ట సంస్కృతి ఈ రాష్ట్ర ప్రత్యేకతలని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆమె వీడియో సందేశాన్ని విడుదల చేశారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఈ వీడియోను ప్రదర్శించారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా తమ పార్టీ పనిచేస్తుందని.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తామని సోనియా గాంధీ తెలిపారు.

---------------------------

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌హెచ్‌ఏఐ టోల్‌ప్లాజాల వద్ద పెరిగిన టోల్ రుసుములు ఈరోజు నుంచి అమలులోకి వచ్చాయి. ఏటా ఏప్రిల్ 1వ తేదీన టోల్ రుసుముల ధరలు పెంచుతుండగా.. ఈసారి లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెంపును వాయిదా వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. చివరి విడత పోలింగ్ జూన్ 1వ తేదీన ముగియడంతో టోల్ ధరల పెంపునకు అనుమతి ఇస్తూ ఎన్‌హెచ్‌ఏఐ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రుసుముల పెంపు సగటున 5 శాతం వరకు ఉంటుంది. పెంచిన ధరలు 2025 మార్చి 31వ తేదీ వరకు అమలులో ఉంటాయి.

---------------------------

ఈ రోజు ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూన్ 3వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. పోలాండ్ దేశానికి చెందిన లెస్ జెక్ సిబిల్ స్కి అనే సామాజికవేత్త కృషి ఫలితంగా సైకిల్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహించాలని కోరుతూ... సైకిల్ పై పర్యటిస్తూ ఆయన 57 దేశాల మద్దతు కూడగట్టారు. ఈ అంశంపై ఐక్య రాజ్య సమితి కార్యాలయం చుట్టూ కూడా అనేక సార్లు సైకిల్‌పై తిరిగారు. లెస్ జెక్ సిబిల్ స్కి శ్రమ ఫలించి.... 2018 సంవత్సరంలో జరిగిన ఐక్య రాజ్య సమితి సర్వ సభ్య సమావేశం...... జూన్ 3ను ప్రపంచ సైకిల్ దినోత్సవంగా ప్రకటించింది.

---------------------------

తెలంగాణలో ఈరోజు, రేపు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ నెల 6వతేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వానలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ మేరకు 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది. ఈరోజు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలతోపాటు హైదరాబాద్, మహబూబాబాద్ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో ఈదురు గాలులతో జల్లులు కురుస్తాయని.. రేపు ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, హైదరాబాద్

జిల్లాల్లో భారీ, ఇతర జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా వరకు విస్తరించాయని, ఒకట్రెండు రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశిస్తాయని వాతావరణశాఖ అంచనా వేసింది. నైరుతి పవనాల ప్రభావంతో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతంతోపాటు కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు తీరాలకు సమీపంలో కొనసాగుతోందని, ఈ ప్రభావంతోనూ తెలంగాణలో వర్షాలు పడతాయని పేర్కొంది.

---------------------------

తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో గతంలో రోజుకు 45 లక్షల మంది ప్రయాణిస్తే మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తరువాత ఆ సంఖ్య సగటున 55 లక్షలకు పెరిగిందని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని 2 వేల కొత్త డీజిల్ బస్సులు, 990 ఎలక్ట్రిక్ బస్సులు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. అందుకనుగుణంగా 3 వేల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు బస్‌భవన్‌లో నిన్న ఘనంగా నిర్వహించారు.

---------------------------

తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్షటెట్ నిన్నటితో ముగిసింది. గత నెల 20వ తేదీన ప్రారంభమైన పరీక్షలు పది రోజుల పాటు జరిగాయి. పేపర్-1కి 86.03 శాతం మంది, పేపర్-2కి 82.58 శాతం మంది హాజరయ్యారు. మార్చి 15వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా పేపర్-1కి 99 వేల958 మంది, పేపర్-2కి 1 లక్ష 86 వేల 423 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 12వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి.

=====================